# అహం



''నాతో చెపితే యేమి చేయాలో చెప్పేవాడిని. మీ అబ్బాయి సైనిక్ స్కూల్లో చదివేవాడు'' విచారం వెల్లడించాడు శివరావు. ఆయన ఒక మినిస్టర్‌కి ప్రాణమిత్రుడు. సెక్రెటేరియట్‌లో కీ పొజిషన్లో వున్నాడు. యెవరన్నా డిజప్పాయింట్ అయి చెప్పుకుంటే సింపతీ చూపిస్తాడు.

మిత్రుడు మోహనరావు నొచ్చుకున్నాడు. ఇంతటి పరపతిగల వాడిని సంప్రతించకుండా, కొడుకుని సైనిక్‌స్కూల్లో అడ్మిట్ చేయాలని చూశానే. నాకు మా అబ్బాయి సెలెక్ట్ అవుతాడని గట్టి నమ్మకం కలిగింది. దానిపేరు యిగో కాబోలు అనుకున్నాడు.

''యేమిటి చెప్పారు కారణం?. మీ అబ్బాయి ఆరోగ్యంగా బలంగా వున్నాడు. సరైన వయస్సు''. మళ్లా సానుభూతి వెల్లడించాడు శివరావు.

''నాక్ నీ. విజన్ బాగా లేదు. ఆస్త్మా స్లైట్‌గా వున్నది. ముందు ముందు యెక్కువ కావచ్చు'' అని అన్‌ఫిట్ అని పంపించేశారు'' మళ్లా విచారంగా చూశాడు.

''వాడి మీద పెద్ద ఆశలు పెంచుకున్నా. పుట్టే బియెం అనిపించుకుంటాడేమో. పోనీ నౌకాదళంలో ప్రయత్నించనా అని ఆలోచిస్తున్నా. ఇంకా టైమున్నది. పదిహేడో యేడు వరకు వేచి చూడాలి. సీతాకాంతం గారబ్బాయి నేవీలో వున్నాడు. యెలా చేరగలిగాడో'' అని స్వగతం పైకన్నాడు మోహనరావు.

'' ఆయన క్రిమినల్ లాయరు క్లయంట్సునూ, పరపతిగల వారినీ ముందే కన్సల్ట్ చేస్తే, ఆశాభంగం కాకుండా, నిబంధనలూ, అందులో కష్టాలూ తెలుసుకున్నాడు'' అన్నాడు శివరావు.

''యేమి చేశాడో మొత్తానికి గెలిచాడు. వాళ్లబ్బాయి మృత్యుంజయుడు నౌకాదళంలో వున్నాడు''.

''ధరావతు కట్టి, మనుషుల్ని మెప్పించి, ''వీడికి ట్రెయినింగ్ యివ్వండి. పరీక్ష వ్రాస్తాడు. ఆపైని దేవుని దయ. ఇప్పుడే నా అంతెత్తు యెదిగాడు. మీరిచ్చే తర్ఫీదుతో అవసరమైన తూకమూ వస్తుంది. ఇదుగో డాక్టరు యిచ్చిన హెల్త్ సర్టిఫికెట్. పిల్లవాడు చురుకైన వాడే. ట్రెయినింగ్ అవుతుండగా నడవడి మీకే తెలిసిపోతుంది. యేదో మీ మీద భరోసా వుంచి, చేర్పిస్తున్నాను' అని ఆఫీసర్లకి తైరు పోశాడు. వారిని సంతోషపెట్టాడు శీతాకాంతంగారు'' అన్నాడు శివరావు.

''అబ్బా! చాలా వోర్మీ పట్టుదలా తెలివితేటలూ, ప్రదర్శించాడే'' అని గ్రహించాడు మోహన్ రావు.

''మీ బంధువులబ్బాయీ సెలెక్ట్ కాలేదుట'' తన బాధను తగ్గించుకోవాలని అన్నాడు మోహన్‌రావు.

''వాళ్లు నన్ను ముందుగా సంప్రతించక, వూరికే బాధగా చెప్పుకున్నారంతే. సానుభూతి కావాలేమో ననుకున్నాను'' అని లేచాడు శివరావు.

2

శివరావు భార్య శాయికుమారి సాంఘిక నవల చదువుకుంటున్నది. వాలుకుర్చీలో వాలి వున్నది. పక్కనే టేబిల్ లాంప్ బాతుమెడది వెలుగుతున్నది. రాత్రి పదిన్నర అయింది. భోజనాలైనై. పిల్లలు నిద్రబోయారు. శివరావు డబుల్ బెడ్ మీద అటుతిరిగి పడుకుని వున్నాడు. పదకొండైంది. ఇటుతిరిగి కళ్లు విప్పి చూశాడు.

''యేమిటి చదువుతున్నావు నిద్రరావటం లేదూ?''

''సాంఘిక నవల పటుత్త్వంగా వుండి, కుతూహలం కలిగించేట్టుంటే చదువుతున్నా. మధ్యాహ్నం నిద్ర తీశాగా. నిద్ర రావటం లేదు'' అన్నది పుస్తకం తొలగించకుండానే.

''పాయింటేమిటే?'' కళ్లు మూసుకుని వెల్లికలా తిరిగాడు. 'పెళ్లిళ్లు ఆగిపోతుంటే, పెళ్లికొడుకులు తిరిగిపోతుంటే, పెళ్లి కూతురుకి చివరికి అర్థమైంది. యెందుకలా జరుగుతున్నదీ?''

''యేమర్థమైందీ?''

''తన తండ్రి లోభిస్తున్నాడని అర్థమై నిలేసింది'' పిల్ల సుఖపడుతుందని అనుకోవూ? పిల్లని వదిలించుకుందామనీ అనుకోవు? పెళ్లి చేయాలని లేదా నాన్నా? నిజం చెప్పేయి' అన్నది. దానికి తండ్రి, 'చేయాలనే వున్నది. అంతెక్కడున్నదీ? అప్పుతెచ్చి చేసినా అంతటితో అయిపోదు. తర్వాత ఆచారాలూ, మర్యాదలూ, వాళ్లంతా యింటిమీద పడి తినటం అదంతా జరగాల్సిందే. అందుకని అంతివ్వ లేను. పెళ్లి చేస్తాను. అన్నా వెళ్లిపోతున్నారు''. చాలా సహజంగా వున్నది. సరీగ్గా నా పెత్తండ్రి అల్లుడు మూర్తి బావ యిలాగే అంటున్నాడు. కూతురి పెళ్లి ఆగిపోతున్నది'' అని నవ్వింది ''చూసి రాశాడా అని ఆలోచిస్తున్నా''.

శివరావు కళ్లు మూసుకునే అన్నాడు. చేతులు గుండెల మీద కలిపి వున్నాయి'' మీ మూర్తి బావనన్నడగచ్చుగా'' నిద్ర కళ్లతో మంద్రస్వరంలో దీర్ఘం తీస్తూ అన్నాడు.

శాయికుమారికి కోపమొచ్చింది. ''మీరు బెట్టుగా వుండి నేను గెజిటెడ్ ఆఫీసర్ని అన్నట్టు మాట్లాడుతూ అసమర్థుడిని గేలిచేసినట్టు మాట్లాడారు. వాళ్లబ్బాయి ఇంటర్ పరీక్ష వ్రాశాడని మూర్తి బావ సంతోషంగా చెబితే ''తప్పుతాడేమో, పార్ట్ బై పార్ట్ అప్పియర్ కమ్మనక పోయారూ. ఆలస్యమైనా తప్పకుండా పాసయేవాడుగా. యేమి గ్రూపు వ్రాశాడూ?'' అన్నారుట. మా బావా ఆఫీసరు కాకపోయినా, సమర్థుడే. పిత్రార్జితం కాపాడుకుంటూ పొదుపుగా చెల్లెళ్ల పెళ్లిళ్లూ, తమ్ముడి పెళ్లీ చేసుకొచ్చాడు. అప్పు చేయటమనేదే యెరగడాయన వచ్చే సంపాదనే సరిపెడతాడు. పద్దు వ్రాసి అనవసర ఖర్చు అయినాయేమోనని చూస్తాడు. లేమి యెరగడు. మీ యింటి కొచ్చి అప్పు కావాలని, పిల్ల పెళ్లి చేయలేకపోతున్నాననీ దేవిరించాలా, సమయానికి మీ రందివ్వగలరో లేదో! దాన కర్ణుడని పేరొచ్చెను. లాకేంత్త్వం దాక్కొమ్మ దిద్ద లేదైపాయె'' అని అంటించింది. పుస్తకం అడ్డం తీసి చూస్తే, శివరావు గురకపెట్టి నిద్ర పోతున్నాడు. శాయికుమారి మూతి విరిచింది.

3

శాయికుమారి వంట చేస్తున్నది. కాలింగ్ బెల్ మోగింది. స్టౌ తగ్గించి సిమ్ మీదికి తిప్పి, వెళ్లి వీధి తలుపు తీసింది. యెదురుగా భవాని. బావగారి కూతురు. మరొక అమ్మాయితో వచ్చింది.

''లోపలికి రండిద్దరూ'' అని దారితీసింది శాయికుమారి. డ్రాయింగ్ రూమ్‌లో కూచోబెట్టి, పనిపిల్లను పిలిచింది.

'' ఆ పెట్టెలూ బెడ్డింగులు బెడ్ రూమ్‌లో పెట్టు. గీసర్ ఆన్ చేయి'' అని పంపింది.

'' ఇలా అయిపోయినావేం భవానీ! పరీక్ష లైనాయా?'' అని దయగా అడుగుతూ నిలబడింది.

''అయిపోయినాయి పిన్నీ! ఈ అమ్మాయి పేరు భానుమతి. మెడిసిన్ చదువుతున్నది. అదుగో మరో ఫ్రెండ్ లోపలికొస్తున్నారు చూడు'' అన్నది. ''రండి అలా కూచోండి'' అన్నది రెండో కొత్తమనిషితో. '' ఈయన డాక్టర్ సురేష్. యెమ్మెస్ చేస్తున్నారు. జంక్షన్‌లో కలిశాము. వాళ్లిద్దరూ యిబ్బందిలో వున్నారని తెలిసి నాతో రమ్మన్నాను పిన్నీ. మనవాళ్లు కాదనుకో'' అని నవ్వాలని ప్రయత్నించింది భవాని.

''నయమే భవానీ! మా పిన్నికి చాదస్తం. వరండాలో భోజనం కానీయమంటుందేమోనని వార్నింగిచ్చావు గాదు. అదుగో బేసిన్. చేతులు కడుక్కోండి'' అని తర్జనితో పక్క గది చూపింది శాయి కుమారి.

''పండురసం తాగి, స్నానాలు కానీయండి ఒక్కొక్కరే. నేను పనిపూర్తి చేసి వస్తానిప్పుడే'' అని శాయికుమారి ఫ్రిజ్ తీసి పండురసమున్న గాజు కూజా తెచ్చింది. ట్రేలో గాజుగ్లాసుల్లో పోసి పోసింది. టవల్స్ కావాలా?'' అనడిగింది.

''అక్కర్లేదు పిన్నీ అన్నీ తెచ్చుకొన్నాం'' అని లేచింది భవాని. తక్కినవారూ లేచారు.

శాయికుమారి పనిపూర్తి అయి, డైనింగ్ టేబిల్ మీద అన్నీ అమరుస్తుండగా, శివరావు వచ్చాడు. పిల్లలు వచ్చారు. డైనింగ్ టేబిల్ యెనిమిది మందికి సరిపోతుంది.

''నేను సాయం చేస్తా పిన్నీ! నీకు పని తాకించాను. వుత్తరమన్నా పడేయకుండా, అతిథులతో సహా వూడిపడ్డాను. సారీ'' స్నానం కానిచ్చి డ్రెస్ చేసుకొచ్చి భవానీ పని అందుకున్నది.

శివరావూ పిల్లలూ భవానీని పలకరించారు. వడ్డన పూర్తి అయేప్పటికి అతిథులు వచ్చారు. అన్నీ మధ్య గాజు గిన్నెలలో వుంచి స్పూన్స్ వేసి శాయికుమారి కూచున్నది. పిల్లలిద్దరు దిండ్లు వేసి కూచున్నారు.

శివరావు అడిగాడు. ''పరీక్షలు బాగా వ్రాశావా? రాంక్ వస్తుందా? రీసెర్చ్ చేయాలని వున్నదా? నీకు హాస్టల్ భోజనం పడలేదేమో? చాలా తీసేశావు. మీ నాన్న యేమంటున్నాడు? సంబంధాలు చూస్తున్నాడా?''.

''నేనూ అదే అడిగానండీ? ఇప్పుడైనా చెప్పాలి భవాని'' అన్నది శాయికుమారి. అందరికీ మారు వడ్డించుకోటానికి గిన్నెలు జరిపింది. ''మొహమాటపడకుండా వడ్డించుకోండి'' అన్నది.

''సంబంధాలు చూస్తున్నాడు నాన్న అని తెలిసింది. అత్తయ్య నన్ను చూడ వచ్చినప్పుడు చెప్పింది. నేనిప్పుడప్పుడే చేసుకోను. జాబ్‌లో చేరాలి నేను అని నాన్నకు వుత్తరం వ్రాశాను. స్కాలర్‌షిప్ వస్తే రీసెర్చ్ చేయాలని వున్నది. నాన్న యిప్పటికే అప్పుతెచ్చి, నాకూ అన్నయ్యకూ పంపుతున్నాడనీ, తన ఖర్చులు తగ్గించుకున్నాడనీ, మందులూ, టానిక్‌లూ మానేసి తానే హోమియో వైద్యం చేసుకుంటున్నాడనీ అత్తయ్య చెప్పింది'' తలొంచుకుని భోజనం చేస్తున్నది.

''నాకు వుత్తరం పడేస్తే బావుండేది భవానీ. నేను మీ యిద్దరికీ డబ్బు పంపేవాడిని. పోన్లే నీ సంగతి విందాం'' అన్నాడు శివరావు. మారు వడ్డించుకున్నాడు.

భవాని మాట్లాడలేదు. డాక్టర్ భానుమతి వుండలేక చెప్పింది.

''వీళ్లకీ పొద్దున్నే తిండి పడేస్తారండీ. హాస్టల్ పిల్లలు యూనివర్శిటీ బస్‌లో వెళ్తారు. మధ్యాన్నం లైబ్రరీ కెళ్లాలని, కాంటీన్ దూరమని వెళ్లదు. సాయంకాలం బస్‌లో హాస్టల్ కొచ్చేస్తారు. టీ అన్నా తాగదు. మళ్లా ఆరింటికి మేకులాంటి అన్నం రుచిపచీలేని భోజనం. ఈ యిబ్బంది చాలక రూమ్‌మేట్ చదువుకోనివ్వక ప్రాణాలు కొరికేస్తారు. తిరిగి వారిని నొవ్వనాడదు. పోట్లాడదు. దిగులుపడుతూ ఫైనల్సు రాసింది. ఇంకో ఆదుర్దా పట్టుకున్నది. ఫస్ట్ పేపర్ పాడైందిట. ఫస్ట్ క్లాస్ రాదేమో స్కాలర్‌షిప్ రాదేమో రీసెర్చ్ చేయాలనుకుంటున్నానే, నాన్న యింక డబ్బు పంపక్కర్లేదనే ఆశతో వున్నానే అని మథనపడింది. రూమ్‌మేట్స్ టీజ్ చేశారు. యెట్లాగో ఫైనల్స్ పూర్తి చేసింది'' అన్నది గడగడా.

''అయ్యో! అదేం పని భవానీ, నాకు వైరిచ్చినా ఫోన్ చేసినా నేను వచ్చేవాడినే. రూమ్ అద్దెకు తీసుకుని, తోడుండేవాడిని. ధైర్యంగా వ్రాసేదానివి'' అన్నాడు శివరావు. మెల్లిగా భోజనం కానిస్తున్నాడు.

''యెట్లా వస్తామ్ బాబాయ్? పియెగాదు నువ్వూ బాధ్యత లెక్కువ. కలెక్టరుగారు పోనీయరేమో అనుకున్నాను. ఆనెస్ట్ అసిస్టెంట్‌ని వదులుతారా? అనుకున్నాను'' అని నవ్వింది భవాని.

''కలెక్టర్ ముఖ్యమా, కూతురు ముఖ్యమా? జీత నష్టం మీదైనా శలవు తెచ్చుకునేవాడిని. పరీక్షలయేవరకేగా. రెండు నెలలు చాలు'' యిబ్బందేమీ లేదని తెలిసేట్టన్నాడు.

''నువ్వలా అంటావని తెలుసు బాబాయ్. అందుకే నీకు తెలియజేయలేదు. సరేనా సంగతి భానుమతి చెప్పింది. గనక వాళ్ళద్దరికీ వచ్చిన క్లిష్ట సమస్యనే చెపుతా. యేదైనా మార్గం కనిబెట్టగలవేమో. ఈ డాక్టర్లిద్దరూ పెళ్లి చేసుకోవాలనే అయిడియాలో వున్నారని తెలిసి, భానుమతి నాన్నగారు, అడ్డు చెప్పటమే గాక, వీలు లేదనటమేగాక, దూషించి డబ్బు పంపటం మానేశారు. కూతుర్ని డిజోన్ చేస్తానని బెదిరించారు. వీళ్లిద్దరి మతాలూ వేరు. అంతేగాక

డాక్టర్ సురేష్ కలవారి బిడ్డ కాదు. స్కాలర్‌షిప్పే ఆధారం. అంతేగాక వారిది లార్జ్ ఫామిలీ. ఈ డాక్టరే మొదటి బిడ్డ. ఇంకా యిబ్బంది అయిన విషయం తనకు అల్లుడుగా తగడని అన్నాడు. అది వదిలేద్దాం అనుకుంటే తన కూతుర్ని వంచించాడని నింద వేశారు భానుమతి నాన్నగారు. పెళ్లి ఆపేయటం మరో యిబ్బంది. భానుమతి తల్లి కాబోతున్నది. ఆ విషయం తండ్రికి చెప్పలేకపోయింది భానుమతి. ఆయన అడిషినల్ జడ్జ్. పోలీస్ శాఖతో పరిచయమేగాక మంచి ఫ్రెండ్స్సున్నా రాయనికి. ఇంకా యితరత్రా పలుకుబడి వున్నది. బలవంతంగా విడదీసి లాక్కు పోతారేమోనని వీళ్లిద్దరూ భయపడి పోయారు. పెళ్లి అనేది ప్రాబ్లమ్ లాగా అయింది. యెవరూ సాల్వ్ చేస్తామనలేదు. యేమిచేయాలో పాలుపోక ఇంకా స్టడీస్ పూర్తి కాలేదని వర్రీ అవుతున్నారు'' భవాని తింటూనే చెప్పేసింది.

భానుమతీ సురేష్ మాట్లాడలేదు. మౌనంగా భోజనం కానిస్తున్నారు.

శాయికుమారి తెల్లబోయింది. పిల్లలిద్దరూ భోజనం కానిచ్చి దిగివెళ్లి పోయారు.

శివరావు అతిథులను ముగ్గుర్నీ చూశాడు.

''అదొక పెద్ద సమస్యా గాదూ, క్లిష్ట పరిస్థితి అసలేగాదు భవానీ, వర్రీ కారాదు. ఈజీగా తీసుకోవాలి. నా కంతా చెప్పారుగా. నే పరిష్కరిస్తా. మీరు ముగ్గురూ యిక్కడే వుండండి. యేం యిబ్బంది లేదు. నేనివాళే వెళ్లి సివిల్ మారేజ్ అరేంజ్ చేసి వస్తా. రెండు రోజుల్లో విందు యిద్దాం. హోటల్‌కి ఆర్డరిచ్చి వస్తా. భానుమతి మేజరే. ఇంక డబ్బును గురించి చింతా? అప్పు యిప్పిస్తా. చదువులయాక తీర్చేయచ్చు'' అని సాదా విషయం లాగా చెప్పాడు.

భవాని సంశయం వెల్లడించింది.

''కాని బాబాయ్! పెద్ద గలాభా చేస్తారేమో? నీమీద కేసుపెడతారేమో? సమయానికి అడ్డుపడతారేమో? నిన్ను కొట్టమని గూండాలను పెడతారేమో? కోపం మీద పంతం పెట్టి యేమైనా చేయచ్చు''.

శివరావు తీయని పెరుగూ అన్నం స్పూన్‌తో తింటున్నాడు.

''నన్నేం చేయలేరు భవానీ. అవసరమొస్తే జైలుకు వెళ్లగల్ను. కోర్టులో బోనులో నిలబడగలను. గూండాలా! నాకూ అటువంటి బలగమున్నది. మీరు ముగ్గురూ బైటికి పోయి అందరికంటూ పడకండి. పనిపూర్తి అయాక మీ యిష్టం. యేడిపించాలి అంతే మార్గం'' అని లేచాడు.

తక్కిన వాళ్లు కళ్లు పెద్దవి చేసి చూశారు. యేమి చేయగలడో! యేమి కానున్నదో అనుకున్నారు.

4

శివరావుని హాస్పటల్ నించి డిశ్చార్జ్ చేశారు. అంబులెన్స్‌లో యింటికి పంపారు. శాయికుమారి, భానుమతీ, భవానీ సేవ చేశారు. భవానీ ఒక పక్షం రోజులుండి వెళ్లిపోయింది. ఆ క్రితం రోజే డాక్టర్లిద్దరూ థాంక్స్ చెప్పి, అప్పు తీరుస్తామని ప్రామిస్ చేసి వెళ్లిపోయారు.

రాత్రి పది గంటలయింది. శివరావు వాలు కుర్చీలో వున్నాడు. దీపం వెలుగుతున్నది. శాయికుమారి లేచి పాలగ్లాసు తెచ్చి అందించింది. శివరావు అందుకుని కొంచెం కొంచెం తాగుతున్నాడు.

పక్క సర్దుతూ శాయికుమారి అడిగింది.

''యెందుకు కలగజేసుకున్నారూ? వాళ్లు మీ రక్త బంధువులు కాదుగా?''

శివరావు జవాబివ్వక నవ్వుతూ చూశాడు.

''మీ ఇగో కాదుగానీ, మిమ్మల్ని చాలా ఆపదలోకి లాగుతున్నదండీ. కాస్త అహం తగ్గించేయరాదూ?'' అన్నది. దోమతెర దింపి పరుపు కిందకి నెట్టింది.

''భానుమతి తండ్రి నాలుగుజిల్లాల అవతలున్నాడు. ఆయనకు వార్త అందేప్పటికి, యిక్కడ పని పూర్తి అయిపోతుందని అంచనా వేశాను. భానుమతి అదృష్టం సాయపడి, పన్లన్నీ త్వరగా జరిగిపోయాయి. ఆ పెళ్లి కొడుకులో యేం చూసిందోనని ఆశ్చర్యం వేసింది నాకు. వాడి కంత అందమైన పిల్లను జడ్జీ

కూతుర్నిస్తారా? వాడికటువంటి అమ్మాయి అందుతుందా అసలు? అని నవ్వు వచ్చింది. వాడి యెమ్మెస్ ఒకటే వాడి స్టేటస్'' అని పాలు పూర్తి చేసి గ్లాసు బల్ల మీదుంచాడు.

''కాని భవానీ గలాటా జరుగుతుందేమోనని సూచించింది. జరగనే జరిగింది. పెళ్లి కొడుకు తలమీద పడాల్సిన గట్టి దెబ్బ మీ తలమీద పడింది. మీ యిగో మీరూ. అది గూడా వో రకమైన పిచ్చేమో. మందు పుచ్చుకోరాదూ? కాస్త యినా తగ్గుతుంది'' అన్నది వ్యంగ్యంగా.

'పెళ్లికొడుకు టార్గెట్ అనుకోలేదు నేను. మనుష్యుల్ని పెట్టాను గదా అని అనుకున్నా. ఆ పెళ్లి ముగియాలి. లేకపోతే వాళ్లిద్దరూ పారిపోవాల్సిందే. చదువులు ఆగిపోతై. పెళ్లికి కొడుకు దెబ్బకు పోయినాడనుకో. భానుమతికి బలవంతంగా యెబార్షన్ చేయిస్తాడు తండ్రి అని సిఐడి చెపుతున్నాడు, అదేం ఆలోచన అని అడ్డుపడ్డా కర్రకు'' అని నవ్వాడు.

''దాని పేరే ఇగో. లెండి. పక్కమీద శయనించాలి. యెలాగో బతికారు. గాయానికింకా పచ్చివున్నదన్నాడు సర్జన్'' అని లేవదీసింది శాయికుమారి.